అనుక్షణం ప్రజల పక్షం
RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



5

**భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు**

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103


సంపుటి - 3 సంచిక -48 ఆదివారం19 జులై 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు 5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం



- భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం
- స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ ప్రయోగం విజయవంతం
- తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం
- అరగంటలోపే సరిదిద్ది పూర్తి చేసిన షార్
- ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం
- ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు



2లో.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన



- 72వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను ప్రకటించిన కేంద్రం
- ఉత్తమ నటులుగా మమ్ముట్టి, కార్తీక్ ఆర్యన్.. ఉత్తమ నటిగా యామి గౌతమ్
- తెలుగులో పలు విభాగాల్లో సత్తా చాటిన 'పుష్ప 2', 'ఖల్కి', 'కమిటీ కుర్రోళ్లు'
- ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌గా 'ఆర్టికల్ 370', ఉత్తమ వినోదాత్మక చిత్రంగా 'ఖల్కి'
- ఉత్తమ దర్శకుడిగా 'అమరన్' చిత్రానికి రాజ్ కుమార్ పెరియసామి



**న్యూఢిల్లీ,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
72వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు చిత్రాలు అదరగొట్టాయి. 2024 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో పలు తెలుగు చిత్రాలకు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అంతేకాదు, ఉత్తమ మేకప్ విభాగంలోనూ అవార్డు వరించింది. కొత్త నటులతో దర్శకుడు యదువంశీ రూపొందించి ఈ చిత్రానికి మెగా డాటర్ మిగతా 2లో...

# గోదావరిలో విషాదం..

## చేపలు పట్టేందుకు వెళ్లి ఐదుగురు గిరిజనుల మృతి



- చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి
- పోలవరం జిల్లా ఎటపాక లో విషాదకర ఘటన
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్

**పోలవరం జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.
మిగతా 2లో...

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

## బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు



- జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ
- కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా
- ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి
- తెలంగాణలో లూటీ జరుగుతోంది
- మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది
- చాయ్ పే చర్చాను మరచిన రాహుల్

**హైదరాబాద్,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది మిగతా 2లో...

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

- హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం
- సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స



2లో.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం



- ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు
- ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం
- సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు
- వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన
- అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన
- ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. మిగతా 2లో...

# పవన్ కళ్యాణ్‌కు లోకేశ్ పరామర్శ

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష



**హైదరాబాద్‌జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. హైదరాబాద్ నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్‌ను కలిసిన ఆయన.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనలు పాటించి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఇటీవల ముంబయిలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రిలో పవన్ కల్యాణ్ శస్త్రచికిత్స చేయించుకున్న సంగతి తెలిసిందే. ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ దిన్షా పార్దీవాలా నేతృత్వంలో వైద్యుల బృందం పవన్ కుడి భుజానికి సర్జరీ చేసింది.

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్




- దొరల గడీల ముందు మోకరిల్లని కవి అందెశ్రీ -వేల ఎకరాల్లో ఫామ్‌హౌజ్‌లతో కులకుతున్న నేతలు
- నేనున్నంత వరకు బిఆర్ఎస్ అధికారంలోకి రావడం కల్ల -నిరుద్యోగులను మోసం చేసిన ఘనులు బిఆర్ఎస్ నేతలు
- అందెశ్రీ స్మృతివనం శంకుస్థాపనలో సిఎం రేవంత్ విమర్శలు

**హైదరాబాద్,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**
దొరల గడీల ముందు మోకరిల్లనని ధైర్యంగా చెప్పిన కవి అందెశ్రీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రముఖ కవిగా, గాయకుడిగా తెలంగాణ సమాజానికి సుపరిచితులైన ఆయన.. తనకు ఆత్మబంధువని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో 'అందెశ్రీ స్మృతివనం' నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందెశ్రీని ఆనాటి ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజా గాయకుడు గద్దర్‌ను కూడా ప్రగతిభవన్ గేటుమిగతా 2లో...

# అందెశ్రీని, గద్దర్‌ను అవమానించిన కెసిఆర్

మొదటిపేజీ తరువాయి

ఎదుట ఎర్రటి ఎండలో నిలబెట్టారని విమర్శించారు. వారిద్దరన్నీ అవమానించినప్పుడే దొరలను సాగనంపాలని జనం నిర్ణయించుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా అందెశ్రీతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న సీఎం, ఆయన తనకు ఆత్మబంధువని, కుటుంబ సభ్యుడిగా, పెద్దన్నగా భావించానని అన్నారు. అందెశ్రీ పాటలు లక్షలాది మందిలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని నింపాయని, తనలోనూ ఉద్యమ చైతన్యాన్ని రగిలించాయని పేర్కొన్నారు. గడీల ముందు మోకరిల్లనని చెప్పిన కవి అందెశ్రీ ఎప్పుడూ దొరల గడప తొక్కలేదని, ఆయన గానంలో గొప్పతనం, సమాజానికి మార్గనిర్దేశం చేసే శక్తి ఉందన్నారు. ఒకప్పుడు నిర్బంధానికి గురైన అందెశ్రీ పాటే నేడు తెలంగాణ రాష్ట్ర గీతంగా మారడం చారిత్రక విషయమని చెప్పారు. ఆనాటి ప్రభుత్వం అందెశ్రీని అవమానించిందని, అలాగే ప్రజాకవి గద్దర్‌ను ప్రగతిభవన్ ఎదుట ఎండలో నిలబెట్టిన ఘటనను కూడా సీఎం గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. గ్రూప్ పరీక్షలు నిర్వహించి నిజంగా ఉద్యోగాలు ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం నోటిఫికేషన్లు ఇచ్చి పేపర్లు లీక్ చేయడం ద్వారా కోట్లు



సంపాదించారని ఆరోపించారు. తమ కుటుంబ సభ్యులు, బంధువులకే ఉద్యోగాలు, పదవులు కట్టబెట్టారని, కష్టపడి చదివిన నిరుద్యోగులను నిరాశపరిచారని విమర్శించారు. గతంలో ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలను ప్రస్తావించిన సీఎం, తెలంగాణను శవాలమయంగా మార్చింది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 70 వేల ఉద్యోగాలు కల్పించామని పేర్కొన్న ఆయన, గత ప్రభుత్వం రాష్ట్రానికి రూ.8 లక్షల కోట్ల అప్పులు మిగిల్చి ఫామ్‌హౌస్ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. కేసీఆర్ నోటిఫికేషన్లు ఇస్తే ఈ ప్రభుత్వం ఉద్యోగాలిచ్చిందని ప్రతిపక్ష నేతలు నిస్సిగ్గుగా చెబుతున్నారని సీఎం మండిపడ్డారు. నిరుద్యోగులు, ఉద్యోగ నియామకాల గురించి ఒక్క రోజైనా బీఆర్ఎస్ పాలకులు ఆలోచించారా? 16 ఏళ్ల తర్వాత.. మేం అధికారంలోకి వచ్చాక గ్రూప్-1 నిర్వహించాం. బీఆర్ఎస్ పాలనలో ఎందరో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే దాదాపు 70 వేల ఉద్యోగాలిచ్చాం. తల్లిదండ్రుల సాక్షిగా వారందరికీ ఉద్యోగ నియామక పత్రాలిచ్చాం. కేసీఆర్ కుటుంబాన్ని తెలంగాణ సమాజం శ్రీమంతుల్ని చేసింది. అలాంటి రాష్ట్రానికి వాళ్లు తిరిగి ఏమిచ్చారు? ఉన్నదంతా దోచుకున్నారు. కేసీఆర్ 1000 ఎకరాల్లో, కేటీఆర్ 100 ఎకరాల్లో, హరీశ్‌రావు 50 ఎకరాల్లో, కవిత 25 ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు కట్టుకున్నారు. మీరు

నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎలా మారారు? కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు అప్పుడే క్షమించారని అనుకుంటున్నారా? నేను ఉన్నంతవరకు మరోసారి మీ సర్కారును రానివ్వను. తెలంగాణను దోచుకోవాలని చూస్తే.. అందెశ్రీ మళ్లీ పాటై పుడతాడని రేవంత్‌రెడ్డి అన్నారు.

# ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

మొదటిపేజీ తరువాయి

ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించడంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# 'విక్రమ్-1'ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్‌డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది. ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు.

ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన

మొదటిపేజీ తరువాయి

నిహారిక కొణిదెల నిర్మాతగా వ్యవహరించడం విశేషం. బాక్సాఫీస్‌తో పాటు ఓటీటీలోనూ అదరగొట్టిన ఈ మూవీ ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గద్దర్ అవార్డుల్లో జాతీయ సమైక్యత, మతసామరస్యం, అణగారిన వర్గాల సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన చిత్రంగా వివిధ విభాగాల్లో మెరిసింది. ఇక నాగ్ అశ్విన్ విజువల్ వండర్ 'కల్కి 2898 ఏడీ'కి రెండు కేటగిరీల్లో అవార్డులను దక్కించుకుంది. అద్భుతమైన సెట్స్, విజువల్స్‌తో అలరించినందుకు ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డుతో పాటు, ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా జాతీయ అవార్డును సొంతం చేసుకుంది. 'ఎంత గొప్పగా ఆడావు అన్నది ముఖ్యం కాదు.. ఎప్పుడు ఆపావన్నదే ముఖ్యం, 'ఒక్క రోజులో ఒక అరగంట నాకు నచ్చినట్టు గడవలేదు. దానికి జీవితాంతం ఏడుస్తూ కూర్చోలేను కదా' వంటి సంభాషణలతో అలరించిన చిత్రం 'లక్కీ భాస్కర్'. ఇలాంటి అద్భుతమైన సంభాషణలను రాసి జీవిత సత్యాలెన్నో చెప్పిన దర్శకుడు వెంకీ అట్లూరి ఉత్తమ రచయితగా జాతీయ అవార్డు దక్కింది. మాస్‌నే కాదు, బాక్సాఫీస్‌ను ఓ ఊపు ఊపేసిన చిత్రం 'పుష్ప2'. ఇప్పుడు ఏకంగా రెండు జాతీయ అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మూవీని ఆద్యంతం అలరించేలా తీర్చిదిద్దిన దర్శకుడు సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత కేటగిరిలో అవార్డుకు ఎంపిక కాగా, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్‌గా దీపాలి నూర్, సీతల్ శర్మలకు అవార్డు దక్కింది. చిన్న చిత్రం కాదు.. ప్రతి ఒక్కరి మనసుల్ని హత్తుకునేంత పెద్ద చిత్రమనించింది '35- చిన్న కథ కాదు'. ఇప్పుడు జాతీయ అవార్డుల్లో ఉత్తమ బాలల చిత్రంతో పాటు, ఉత్తమ బాల నటుడిగా అరుణ్‌దేవ్ పోతుల అవార్డుకు ఎంపికయ్యారు.

# గోదావరిలో విషాదం..

మొదటిపేజీ తరువాయి

ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు.

# సోనమ్ వాంగ్ చుక్ నిరాహారదీక్ష భగ్నం

## హైకోర్టు ఆదేశాలతో పోలీసుల నిర్ణయం

## సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తరలించి చికిత్స

**న్యూఢిల్లీ,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద 21 రోజులుగా నిరాహారదీక్ష చేస్తోన్న పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శపోలీసులు బలవంతంగా శనివారం ఆసుపత్రికి తరలించారు. ఆయనకు తగిన వైద్యసహాయం అందించాలంటూ ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నిరసన ప్రాంతం నుంచి పోలీసులు బలవంతంగా తీసుకెళ్లారు. ప్రవేశ పరీక్షల నిర్వహణలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో గత నెలాఖరులో దీక్ష ప్రారంభించగా.. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్షీణించింది. ఆయన్ను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉందని సమాచారం. కోర్టు ఆదేశాల ప్రకారం వాంగ్‌చుక్‌ను తరలిస్తోన్న సమయంలో నిరసనకారులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉంది. జంతర్‌మంతర్ వద్ద నిరసనకారులు శాంతియుతంగా వ్యవహరించా లని, వీలైనంత త్వరగా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయాలని కోరుతున్నామని ఢిల్లీ పోలీసులు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తన అనుమతి లేకుండా తన భర్తకు ఎలాంటి చికిత్సా అందించొద్దని వాంగ్‌చుక్ భార్య గీతాంజలి జె ఆంగ్మో డిమాండ్ చేశారు. ఆయన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఉన్నారు. నా అనుమతిలేకుండా చికిత్స ప్రారంభించవద్దు. ఆయనకు ఏదైనా జరిగితే ప్రతిఒక్కరిని బాధ్యుల్ని చేస్తాను. ఆయన నిన్న బాగానే కనిపించారు. ఆసుపత్రికి తీసుకురావాల్సిన అవసరం లేదు. మా వైద్యుడి అనుమతి లేకుండా ఏ చికిత్సా అందించడానికి వీలు లేదు. అది మా హక్కు అని మీడియాతో మాట్లాడారు.

### వాంగ్‌చుక్ తరలింపుతో దీక్షకు దిగిన దీప్కే

పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను ఆసుపత్రికి తరలించడంతో ఈ ఉద్యమం ఆగిపోదని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడించారు. ఇక నుంచి తాను నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ప్రకటించారు. ఈ రోజు నుంచి దీక్ష ప్రారంభిస్తున్నాను. వెనకడుగు వేయొద్దని మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రతి ఒక్కరు జంతర్‌మంతర్‌కు రావాలని కోరుతున్నాను. జులై 20న జరగాల్సిన పాదయాత్రను కొనసాగిస్తాం అని వెల్లడించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కొన్ని వారాల క్రితం కాక్రోచ్ పార్టీ తొలుత ఢిల్లీలో నిరసనలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే వాంగ్‌చుక్ నిరాహార దీక్ష ప్రారంభించారు. జులై 20న పార్లమెంట్‌కు శాంతియుత మార్చ్ 'చలో సంసద్'ను నిర్వహించనున్నట్లు కాక్రోచ్ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఆ రోజునే పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం వాంగ్‌చుక్‌ను ఉంచిన సఫ్దర్‌జంగ్ ఆసుపత్రి వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రకటన విడుదల చేశారు. నిరాహార దీక్ష కారణంగా ఆయన బలహీనపడ్డారు. డీహైడ్రేషన్‌కు గురయ్యారు. నిరంతర వైద్యపర్యవేక్షణ, చికిత్స అందిచాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. మరోవైపు ఆసుపత్రిలోకి ఫోన్ తీసుకెళ్లేందుకు అనుమతించకపోవడంతో అక్కడి సిబ్బందిపై వాంగ్‌చుక్ భార్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

మొదటిపేజీ తరువాయి

అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి



మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు

బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్



విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

## రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి

### -తహసీల్దార్ నాగరాజు.



**బయ్యారం/,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** మండలంలోని రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డులకు సంబంధించి ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేయని వారు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ నాగరాజు తెలిపారు.రేషన్ కార్డులో నమోదైన ప్రతి సభ్యుడు తప్పనిసరిగా సమీపంలోని చౌకధరల దుకాణానికి వెళ్లి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ ధృవీకరణ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం నిర్ణయించిన జులై 31 తేదిలోపు ఈ-కేవైసీ పూర్తి చేయని సభ్యులకు భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు,రేషన్ సేవల కొనసాగింపులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తహసీల్దార్ తెలిపారు.మండలంలోని రేషన్ కార్డుదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వ సేవలను నిరంతరాయంగా పొందాలని తహసీల్దార్ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బావులే లక్ష్యం.. కాపర్ వైర్ల చోరీ

### మూడు రైతులకు నష్టం.. పోలీసులకు ఫిర్యాదు



**ఎల్కతుర్తి/, జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ఎల్కతుర్తి మండలం దామెర గ్రామ శివారులోని వ్యవసాయ బావుల వద్ద గుర్తుతెలియని దుండగులు మోటార్లకు చెందిన కాపర్ వైర్లను అపహరించారు. దీంతో రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లింది. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.బాధితుల వివరాల ప్రకారం.. ఆవుల రాజేందర్‌కు చెందిన 10 గోలల కాపర్ వైరు, మద్దే చిన్న రాజమౌళికి చెందిన 12 గోలల వైరు, మహ్మద్ తాజొద్దీన్ పాషాకు చెందిన మూడు బావుల నుంచి సుమారు 30 గోలల కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి.దామెరబోడగుట్టకొత్తపల్లి శివారు ప్రాంతాల్లో వ్యవసాయ బావులు తరచూ దొంగల బారిన పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వరుస చోరీలతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని, రాత్రి వేళల్లో పోలీసు గస్తీ పెంచి నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి బావుల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని రైతు నాయకుడు రైతు మార్పు రాజు సూచించారు

## సీఎం రేవంత్ పర్యటన విజయవంతం చేయాలి

### : సూరంపల్లి రామారావు



**వైరా, /జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ఈ నెల 20న ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం అంజనాపురంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న సందర్భంగా పర్యటనను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కొణిజర్ల మండలం మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు పిలుపునిచ్చారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పామాయిల్ రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రైతులకు అండగా నిలుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతు సంక్షేమ పథకాల అమలుతో ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైరా ఎమ్మెల్యే బాలోతు రాందాస్ నాయక్ పాల్గొనే ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, పార్టీ కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సూరంపల్లి రామారావు విజ్ఞప్తి చేశారు.

## బయ్యారం విద్యుత్ శాఖ ఏఈగా రఫీవుద్దీన్ బాధ్యతల స్వీకరణ.



**బయ్యారం/,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండల విద్యుత్ శాఖ ఏఈగా మహ్మద్ రఫీవుద్దీన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల సూచనలతో మండల అధికారుల సమన్వయంతో,ఇతర విభాగాల సహకారంతో విద్యుత్ అంతరాయం లేకుండా తన వంతు సేవలు అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని పేర్కొన్నారు.అన్ని గ్రామాల్లో ఉన్న లైన్ మెన్లను,ఇతర సిబ్బంది, సమన్వయం,సహకారంతో పకడ్బందీగా సేవలందియడానికి తన సహాయ సహకారాలు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటాయని మహ్మద్ రఫీవుద్దీన్ వెల్లడించారు.విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితుడికి అప్పగించిన పోలీసులు.




**బయ్యారం/,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసిన సుమారు రూ.యాభై వేల విలువైన మొబైల్ ఫోనును సంబంధిత బాధితుడు పర్శబోయిన వెంకన్నకు బయ్యారం ఎస్ఐ ప్రశాంత్ బాబు శనివారం అందించారు. వివరాల్లోకి వెళ్తే.. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పర్శబోయిన వెంకన్న మొబైల్ ఫోన్ ను గంధంపల్లిలో జులై 14న పోగొట్టుకున్నాడు.పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ ప్రక్రియ ద్వారా ట్రేస్ చేసి శనివారం బాధితుడికి అందించినట్లు ఎస్ఐ తెలిపారు.మొబైల్ పోయిన పక్షంలో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల ఫోన్లు ట్రేస్ చేసి తిరిగి పొందడం సులభమవుతుందని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ ప్రశాంత్ బాబు సూచించారు.ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుల్ రాజేశ్వరి ఇతర సిబ్బంది ఉన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్

### ఐదు నెలల గౌరవ వేతనం రూ.32,500 గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేత

### వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి సేవాభావానికి ప్రశంసలు



**వేలేరు/, జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ప్రజాప్రతినిధులే నిజమైన నాయకులని మరోసారి నిరూపించారు వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బిల్లా యాదగిరి. పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకు కాకుండా ప్రజా సేవకు వినియోగిస్తానని ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆయన, తనకు ప్రభుత్వం నుంచి అందుతున్న గౌరవ వేతనాన్ని గ్రామపంచాయతీ సిబ్బందికే అందజేస్తానని ఇచ్చిన మాటను ఆచరణలో చూపించారు.ఈ క్రమంలో శనివారం తనకు ఇప్పటివరకు అందిన ఐదు నెలల గౌరవ వేతనం మొత్తం రూ.32,500ను గ్రామపంచాయతీ సిబ్బందికి నగదు రూపంలో అందజేశారు. గ్రామపంచాయతీ అభివృద్ధిలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు తనవంతు ప్రోత్సాహంగా ఈ మొత్తాన్ని అందిస్తున్నట్లు సర్పంచ్ బిల్లా యాదగిరి తెలిపారు.ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బంది సర్పంచ్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా ఇచ్చిన హామీని ఎలాంటి ఆలస్యం లేకుండా అమలు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. పదవిలోకి వచ్చిన వెంటనే వ్యక్తిగత ప్రయోజనాల కంటే సిబ్బంది సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవడం ఇతర ప్రజాప్రతినిధులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. సర్పంచ్ బిల్లా యాదగిరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయతో పాటు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఉక్కుపాదం

### ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవు . -తహసీల్దార్ బావ్ సింగ్




**ధర్మసాగర్/హనుమకొండ బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మసాగర్ తహసీల్దార్ బావ్ సింగ్ హెచ్చరించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలను అక్రమంగా ఆక్రమించడం చట్టవిరుద్ధమని, ఎంతటి వారైనా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.శనివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రభుత్వ భూములు పాఠశాలలు, అంగన్‌వాడీలు, రహదారులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రజా అవసరాల కోసం కేటాయించినవని తెలిపారు. వాటిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ భూమిపై హక్కు ఉందని భావించే వారు సంబంధిత ఉన్నతాధికారులను సంప్రదించి, నిబంధనల ప్రకారం పట్టా పొందిన తర్వాతే వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కేసులు నమోదు చేసి, ఆక్రమణలను తొలగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాలు ప్రభుత్వ భూముల పరిరక్షణలో చొరవ చూపాలని తహసీల్దార్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఎక్కడైనా ఆక్రమణలు కనిపిస్తే వెంటనే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమే. అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు అని తహసీల్దార్ బావ్ సింగ్ స్పష్టం చేశారు.

# నవీన్ నాయక్‌పై దాడి కేసులో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేయాలి





**నర్సంపేట/, జూలై 18: (జర్నలిస్ట్ వార్త)** నర్సంపేట మున్సిపాలిటీ 16వ వార్డు కౌన్సిలర్ భానోత్ నవీన్ నాయక్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు డిమాండ్ చేశారు.శనివారం నర్సంపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదన్నపేట చెరువు మత్తడి ప్రాంతంలో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా చర్యలు తీసుకుని ట్రాక్టర్లు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు.అక్రమ మట్టి రవాణా కారణంగా ప్రజలకు ప్రమాదం ఏర్పడుతోందని, గతంలోనూ ఇదే ప్రాంతంలో దాడులు జరిగినా కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. నవీన్ నాయక్‌పై దాడి ఘటనను నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గిరిజనుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు భూక్యా జగన్ నాయక్, మాలోత్ సంతోష్ నాయక్, ధారావత్ సుభాష్ నాయక్, పోరా రాములు, మాలోత్ శ్రావణ్ కుమార్, గుగులోత్ సుమన్ నాయక్, భానోత్ గాంధీ నాయక్, ఇస్లావత్ నెహ్రూ, బోడ రమేష్, బాదావత్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# కిట్స్‌కు రెండు కొత్త బీటెక్ కోర్సులు

### ఏఐసీటీఈ, రాష్ట్ర ప్రభుత్వ గ్రీన్‌సిగ్నల్.. 202627 నుంచే ప్రవేశాలు



**హసన్‌పర్తి/, జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** వరంగల్‌లోని కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్-డబ్ల్యూ)కు 202627 విద్యా సంవత్సరానికి గాను రెండు కొత్త బీటెక్ కోర్సులతో పాటు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్)లో అదనపు సెక్షన్‌కు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), తెలంగాణ ప్రభుత్వం ఆమోదం తెలిపాయి.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోకరెడ్డి శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ), ఈసీఈ (వీఎల్ఎస్ఐ డిజైన్ అండ్ టెక్నాలజీ) పేరుతో రెండు కొత్త బీటెక్ కోర్సులు ప్రారంభం కానుండగా, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (డేటా సైన్స్) విభాగానికి అదనపు సెక్షన్‌ను కూడా మంజూరు చేశారు. 202627 విద్యా సంవత్సరం నుంచే ఈ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కిట్స్-డబ్ల్యూ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతల విస్తరణతో సైబర్ సెక్యూరిటీ, వీఎల్ఎస్ఐ, డేటా సైన్స్ రంగాలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ ఏర్పడిందన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కోర్సులను ప్రవేశపెడుతున్నామని తెలిపారు.

భవిష్యత్ పరిశ్రమల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలనే కిట్స్-డబ్ల్యూ సంకల్పానికి ఈ కొత్త కోర్సులు నిదర్శనమని పేర్కొన్నారు.

కిట్స్-డబ్ల్యూ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి. నారాయణరెడ్డి కొత్త కోర్సుల మంజూరుపై అధ్యాపక బృందాన్ని అభినందించారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, డీన్లు, విభాగాధిపతులు, డాక్టర్ డి. ప్రభాకరాచారి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులనే ఆదరించాలి

## ఎల్లాపూర్‌లో విద్యార్థులకు డైరీల పంపిణీ.. తల్లిదండ్రులకు పిలుపు




**హసన్‌పర్తి, /జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తగ్గడం ఆందోళనకరమని, ప్రతి గ్రామస్తుడు బాధ్యతగా తన పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని స్నేహ పరపతి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకుడు వెలిశోజు మురళి పిలుపునిచ్చారు. 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రులుఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా స్నేహ పరపతి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు డైరీలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా వెలిశోజు మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, క్రీడా మైదానాలు వంటి అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపడం వల్ల ప్రభుత్వ విద్యా వ్యవస్థ దెబ్బతింటోందన్నారు. విద్యార్థుల సంఖ్య మరింత తగ్గితే గ్రామీణ పాఠశాలల ఉనికికే ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాధాన్యంగా అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్తులంతా ప్రభుత్వ బడులను ఆదరించి విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నేదునూరి సాంబయ్య, ఎర్రచెరలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్నేహ పరపతి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సేవలను పాఠశాల యాజమాన్యం అభినందించింది.

# నీటి సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## భవిష్యత్ తరాలకు నీటి భద్రతే లక్ష్యం: మున్సిపల్ కమిషనర్ రామచంద్రరావు




**వైరా,/ జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** నీటి వనరుల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించాలంటే వర్షపు నీటి సంరక్షణ చర్యలను విస్తృతంగా చేపట్టాలని వైరా మున్సిపల్ కమిషనర్ మేడూరి రామచంద్రరావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వ జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'జల్ సంచయ్ జన్ భాగిధారి (జేఎస్‌జేబీ)3.0' కార్యక్రమంలో భాగంగా వైరా మున్సిపాలిటీ 2వ వార్డు హనుమాన్ బజారులో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత కలిసి నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.
ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవడం, ఇంకుడు గుంతలు నిర్మించడం, నీటి వృథాను అరికట్టడం, భూగర్భ జలాలను పెంపొందించడం, చెరువులను పరిరక్షించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ప్రతి బొట్టు అమూల్యమని, ప్రజల భాగస్వామ్యంతోనే నీటి భద్రత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ బి. వెంకట్రావు, మెప్మా ఆర్పీ దుర్గ, వార్డు ప్రజలు, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# గొంతు కోసి వృద్ధురాలి హత్య...

# బంగారు నగలతో పరార్

### పక్షవాతంతో ఉన్న భర్త ఎదుటే దారుణం.. పిండిప్రోలులో కలకలం



**ఖమ్మం, జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని గుర్తుతెలియని దుండగులు గొంతు కోసి హత్య చేసి, ఆమె ఒంటిపై ఉన్న బంగారు నగలను అపహరించిన ఘటన గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. చెన్న సుగుణమ్మ (60) తన భర్త జనార్ధన్‌తో కలిసి నివాసం ఉంటోంది. జనార్ధన్ కొంతకాలంగా పక్షవాతంతో మంచానికే పరిమితమయ్యాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడిన దుండగులు సుగుణమ్మను అత్యంత దారుణంగా హత్య చేసి, ఆమె ధరించిన బంగారు నగలను తీసుకుని పరారైనట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పక్షవాతంతో బాధపడుతున్న భర్తను కంటికి రెప్పలా చూసుకుంటున్న సుగుణమ్మ హత్యకు గురికావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, నిందితులను గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం హత్యకు గల పూర్తి కారణాలు, నగల కోసమే ఈ దారుణానికి పాల్పడ్డారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

# భాస్కర్ హత్యపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి

## బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: ఎమ్మార్పీఎస్ఎంఎస్పీ నేతల డిమాండ్



**హసన్‌పర్తి,/ జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లో హత్యకు గురైన దళిత యువకుడు సినేపల్లి భాస్కర్ కేసులో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసి, విచారణను వేగవంతంగా పూర్తి చేసి నిందితులకు కఠిన శిక్షలు విధించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజన్ వెంకట్‌స్వామి మాదిగ డిమాండ్ చేశారు. భాస్కర్ స్వగ్రామమైన ఉప్పరపల్లిలో శనివారం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ బృందం పర్యటించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో మాట్లాడి వివరాలు సేకరించింది. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, భాస్కర్ హత్య కులాంతర ప్రేమ వ్యవహారానికి సంబంధించినదేనని ఆరోపించారు. భాస్కర్‌ను కుల కారణాలతోనే లక్ష్యంగా చేసుకుని ఈ దారుణానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. అలాగే, నేరాన్ని కప్పిపుచ్చేందుకు భాస్కర్ వ్యక్తిత్వంపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. భాస్కర్ స్వగ్రామంలో ఎలాంటి వివాదాలు లేదా గొడవల చరిత్ర లేదని, గ్రామస్తుల నుంచి తాము సేకరించిన సమాచారంలో ఇదే విషయం వెల్లడైందని తెలిపారు. ఇప్పటికే ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినప్పటికీ, కేసులో ఉన్న ఇతర అనుమానితుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చి వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం ప్రకారం బాధిత కుటుంబానికి అందాల్సిన అన్ని ప్రయోజనాలు కల్పించాలని కోరారు.
భాస్కర్ కుటుంబం పూర్తిగా అతనిపైనే ఆధారపడి జీవిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి న్యాయం జరిగే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావ నేపథ్యంలో

# వరి సాగుపై రైతులకు అవగాహన.




**బయ్యారం/,జులై 18.(జర్నలిస్ట్ వార్త)** బయ్యారం మండలంలోని జగ్గుతండా గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కే.రాజు ఆధ్వర్యంలో వరి సాగు చేస్తున్న రైతులతో ఎల్‌నినో ప్రభావం,ప్రస్తుత వాతావరణ పరిస్థితులు,నీటి లభ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో వరి నారు నిర్వహణ పై విస్తృతంగా చర్చించి, నాణ్యమైన నారు పెంపకం,నీటి పొదుపు పద్ధతులు మరియు సమయానుకూల యాజమాన్య చర్యల గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరులు సరిపడ అందుబాటులో ఉన్న రైతులు మాత్రమే తమ భూమిలో కొంత భాగంలో వరి సాగు చేపట్టి,మిగిలిన భూమిలో పప్పుధాన్యాలు,కూరగాయలు వంటి తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. చెరువుల్లో కూడా నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేనందున తక్కువ నీటి అవసరం ఉండే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారులు రైతులకు విజ్ఞప్తి చేశారు.

# దేవన్నపేట టోల్‌ప్లాజా-ఎల్కతుర్తి రహదారికి ప్రతిపాదనలు

## 100 అడుగుల వెడల్పుతో కొత్త రోడ్డుకు కసరత్తు.. ప్రయాణ సౌకర్యం మెరుగుపడనున్నదని ఆశాభావం




**ఎల్కతుర్తి, /జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** దేవన్నపేట టోల్‌ప్లాజా నుంచి ఉనికిచర్ల, మడిపల్లి మీదుగా ఎల్కతుర్తి వరకు కొత్త రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో సుమారు ఐదు కిలోమీటర్ల మేర 100 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణానికి ప్రాథమిక ప్రతిపాదనలు రూపొందించినట్లు అధికార వర్గాల సమాచారం. ఇటీవల రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, కుడా ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి మడిపల్లిఎల్కతుర్తి రహదారిని పరిశీలించారు. అనంతరం మడిపల్లి నుంచి ఎల్కతుర్తి సర్కిల్, బస్టాండ్ వరకు, అక్కడి నుంచి సిద్ధిపేట, కరీంనగర్, వరంగల్ వైపు అనుసంధానం మెరుగుపరిచే దిశగా ప్రణాళికలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కొత్త రహదారి ప్రతిపాదనతో ఈ ప్రాంతంలో భూముల విలువలు పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు కూడా పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. మరోవైపు, మండల కేంద్ర పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు సంబంధిత శాఖలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రహదారి నిర్మాణానికి ప్రభుత్వ, ప్రైవేటు భూముల అవసరంపై అధికారులు సర్వేలు, భూసేకరణ ప్రక్రియను నిబంధనల మేరకు చేపట్టనున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఎల్కతుర్తి అభివృద్ధి నేపథ్యంలో సర్కిల్, బస్టాండ్ అభివృద్ధితో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుపై కూడా స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం నుంచి అధికారిక నిర్ణయం వెలువడాల్సి ఉంది.

# ఏకగ్రీవంగా ఎన్నికైన అర్చకుల మండల కమిటీ




**భీమదేవరపల్లి/జూలై18 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండల కేంద్రంలోని శ్రీ భీమేశ్వర ఆలయంలో శనివారం దూప దీప నైవేద్య అర్చకుల మండల స్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు గణేష్ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బూరుగుపల్లి అఖిల్ సాయిశర్మ, ఉపాధ్యక్షుడిగా గుడికందుల రమేషాచారి, కార్యదర్శిగా గుండ్ల శ్రీరామ శర్మ, కోశాధికారిగా అనుముల ప్రవీణ్ శర్మ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొండ్ర హరీష్, తిముగుల సదాశివశర్మ, శ్రీరామ శర్మ, ఉప్పల కోటిచారి తదితరులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు సమావేశంలో పాల్గొన్న అర్చకులు శుభాకాంక్షలు తెలియజేసి, అర్చకుల సంక్షేమం, సంఘ బలోపేతం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# చల్ల వెంకట్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా అన్నదానం

### వృద్ధాశ్రమం, అనాథాశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించిన ఆప్తమిత్ర బృందం




**హసన్‌పర్తి,/ జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** హసన్‌పర్తి మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ 57వ డివిజన్ మాజీ అధ్యక్షుడు దివంగత చల్ల వెంకట్‌రెడ్డి దశదిన కర్మ సందర్భంగా ఆయన ఆప్తమిత్ర బృందం శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించింది. లార్డ్ వృద్ధాశ్రమం, అతిథి అనాథాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేపట్టి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చల్ల వెంకట్‌రెడ్డి ఆప్తమిత్రుడు చిర్ర సుమన్‌గౌడ్ మాట్లాడుతూ.. సాధారణ జీవనం, అసాధారణ వ్యక్తిత్వం, నిస్వార్థ ప్రజాసేవకు చల్ల వెంకట్‌రెడ్డి నిదర్శనమని కొనియాడారు. చిన్నప్పటి నుంచి ఆయనను చూసి పెరిగానని, ఆయన చెప్పిన ప్రతి మాట, ఇచ్చిన ప్రతి సలహా తన జీవితానికి మార్గదర్శకంగా నిలిచాయని అన్నారు. ప్రజలపై అపారమైన ప్రేమ, సేవ పట్ల అంకితభావం, అధికారాన్ని కాదు బాధ్యతను నమ్మే తత్వం వెంకట్‌రెడ్డిని ప్రత్యేక వ్యక్తిగా నిలబెట్టాయని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలకు మరో రూపమే చల్ల వెంకన్న అని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారానే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు.
బీఆర్ఎస్ పార్టీ అప్పగించిన ప్రతి బాధ్యతను క్రమశిక్షణతో నిర్వహించే కార్యకర్తగా వెంకట్‌రెడ్డి గుర్తింపు పొందారని, ఆయన మృతి పార్టీతో పాటు తమలాంటి కార్యకర్తలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లెంట్ల శ్రీధర్, కన్నబోయిన రాజు యాదవ్, చిర్ర రాజేష్‌గౌడ్, మట్టెడ శ్రీనివాస్, పెద్ద కరుణాకర్, మట్టెడ అనిల్, గుడికందుల శ్రీనివాస్, మట్టెడ కరుణాకర్, తేలుకుంట్ల సతీష్‌చారి, ఆశ్రమ నిర్వాహకులు నరేష్‌గౌడ్, రమ్య తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఎస్ఎఫ్ఐ

**కేయూలో దిష్టిబొమ్మ దహన యత్నం.. అడ్డుకున్న పోలీసులు -నీట్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్**







**హసన్‌పర్తి,/ జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ కార్యాలయం నుంచి మొదటి గేటు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడుతూ, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీలతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని పేర్కొన్నారు. పారదర్శకత కోల్పోయిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను రద్దు చేసి, వైద్య ప్రవేశ పరీక్షలు నిర్వహించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రీకృత పరీక్షల విధానం వల్ల ఒకచోట జరిగిన అక్రమాల ప్రభావం దేశవ్యాప్తంగా విద్యార్థులపై పడుతోందని విమర్శించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద సామాజిక కార్యకర్త, విద్యావేత్త సోనం వాంగ్చుక్ చేపట్టిన నిరాహార దీక్షను భగ్నం చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. ఆయన పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూ, నీట్ అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్షుడు చెన్నూరి సాయికుమార్, కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్, జిల్లా కమిటీ సభ్యులు బొచ్చు ఈశ్వర్, ఎం.డి. ఇస్మాయిల్, ఆర్. పవన్‌కుమార్, నాగరాజ్, రాహుల్, రాజ్‌కుమార్, సందీప్, పవన్‌తో పాటు పలువురు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

# మృత్యు ఉచ్చులుగా విద్యుత్ లైన్లు!

**ఎర్రనాము కాలనీలో 33 కేవీ, 11 కేవీ లైన్ల మధ్య బిక్కుబిక్కుమంటున్న జనం**

**షార్ట్‌సర్క్యూట్‌లతో కాలిపోతున్న గృహోపకరణాలు..**

**స్కూల్ వ్యాన్ల రాకపోకలతో తల్లిదండ్రుల్లో ఆందోళన.. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**



**దామరచర్ల/ జూలై 18 (జర్నలిస్ట్ వార్త):** దామరచర్ల మండలంలోని ఎర్రనాము కాలనీలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలపై ముప్పుగా మారింది. ఒకే వీధిలో ఒకవైపు 33 కేవీ హైటెన్షన్ లైన్, మరోవైపు 11 కేవీ విద్యుత్ లైన్ ఉండటంతో కాలనీవాసులు నిత్యం భయాందోళనల మధ్య జీవిస్తున్నారు. చిన్నపాటి గాలి, వర్షం వచ్చినా లైన్లు షార్ట్‌సర్క్యూట్‌కు గురవుతూ ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఇతర విద్యుత్ పరికరాలు పలుమార్లు దగ్ధమవుతున్నాయని బాధితులు వాపోతున్నారు. అంతేకాకుండా హైటెన్షన్ లైన్ల కిందకు సర్వీస్ వైర్లు ప్రమాదకరంగా వేలాడుతూ ఉండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఇదే మార్గంలో ప్రతిరోజూ చిన్నారులతో స్కూల్ వ్యాన్లు రాకపోకలు సాగిస్తున్నాయని, ఏ చిన్న ప్రమాదం జరిగినా అమాయక పిల్లల ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. పెద్ద ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ఇప్పుడే విద్యుత్ లైన్లను సురక్షితంగా మార్చి ప్రజల ప్రాణాలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని, విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.


## రేపు వర్ధన్నపేటలో వాహనాల బహిరంగ వేలం

**వర్ధన్నపేట/జూలై 18(జర్నలిస్ట్ వార్త )**

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు రేపు (సోమవారం, తేదీ 20-07-2026) బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వర్ధన్నపేట స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉదయం 10 గంటల నుంచి ఈ వేలం పాట ప్రారంభమవుతుంది. వేలంలో పాల్గొనదలచిన వారు ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 50 శాతం మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేసి టోకెన్ పొందాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాములు భౌతికకాయానికి మహేందర్ గౌడ్ నివాళి





**ఐనవోలు/జూలై 18 (జర్నలిస్ట్ వార్త);** ఐనవోలు మండలంలోని నాగపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అనుముల రాములు మృతి చెందగా, శనివారం ఆయన భౌతికకాయానికి హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు రాములు నివాసానికి వెళ్లిన ఆయన, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి రాములు అందించిన సేవలు మరవలేనివని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడు బరిగెల భాస్కర్, మండల అధికార ప్రతినిధి కొత్తూరి సునీల్, ఒంటిమామిడిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు గిర్క రాజు, మాజీ ఉపసర్పంచ్ కొట్టం రాజు, సీనియర్ నాయకులు అనుముల బుచ్చిరెడ్డి, కడ్దూరి నర్సిరెడ్డి, పెండల వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఫాల్కన్ గ్రూప్ సిఎండి అమర్‌దీప్‌ను అరెస్ట్ చేసిన ఇడి

**14రోజుల రిమాండ్ విధించిన కోర్టు..చర్లపల్లికి తరలింపు**

**హైదరాబాద్,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**




ఫాల్కన్ గ్రూప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఫాల్కన్ సీఎండీ అమర్‌దీప్ కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తీహార్ జైలు నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చి అమర్‌దీప్ అరెస్ట్‌ను చూపించారు అధికారులు. అనంతరం ఫాల్కన్ సీఎండీని న్యాయస్థానంలో హాజరుపరచగా.. కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో అధికారులు అమర్‌దీప్‌ను చర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. ఫాల్కన్ సంస్థ.. పెట్టుబడిదారులకు 11 శాతం నుంచి 21 శాతం వరకు అధిక లాభాలు ఇస్తామని హామీ ఇచ్చి భారీగా నిధులు సమీకరించినట్లు ఈడీ గుర్తించింది. మొత్తం రూ.4,215 కోట్ల మేర పెట్టుబడులు సేకరించినట్లు వెల్లడించింది. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బుతో పాత పెట్టుబడిదారులకు చెల్లింపులు చేసినట్లు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గుర్తించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు రూ.792 కోట్లను నేర ఆదాయంగా (ఖసనీఇ॥టబ నౌ అసతిప।) గుర్తించినట్లు తెలిపింది. ఇప్పటికే ఈ కేసులో రంగారెడ్డి జిల్లాలోని ఆస్తులతో పాటు హాకర్ 800ం విమానం సహా రూ.20.6 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. విచారణకు సహకరించకపోవడంతో ఖఓఒం సెక్షన్-19 కింద అమర్‌దీప్ కుమార్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఫాల్కన్ మనీలాండరింగ్ కేసులో నిధుల మళ్లింపు, ఇతర నిందితుల పాత్రపైనా ఈడీ దర్యాప్తు కొనసాగుతోంది.

# ఈ కాలం.. చిరుధాన్యాలదే!

# వరి వద్దు.. ప్రత్యామ్నాయమే ముద్దు

**వర్ధన్నపేట మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్.**






**వర్ధన్నపేట/జులై 18(జర్నలిస్ట్ వార్త);** ఎల్-నినో ముప్పు ముంచుకొస్తున్న తరుణంలో రైతాంగం సాంప్రదాయ వరి సాగుకు దూరంగా ఉండి, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల వైపు అడుగులు వేయడమే బుద్ధిమంతమని మండల వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట రైతు వేదికలో ఎల్-నినో ప్రభావం - ఖరీఫ్ ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక పై రైతులకు విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ విస్తరణ అధికారి స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సదస్సులో వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం ఆందోళనకరంగా తగ్గిందని గణాంకాలతో వివరించారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 115.1 మి.మీ. కురవాల్సి ఉండగా, కేవలం 93.6 మి.మీ. మాత్రమే కురిసి 18.7 శాతం లోటు నమోదైందని పేర్కొన్నారు. ఇక జూలై నెలలో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని, సాధారణ వర్షపాతం 191.7 మి.మీ. గానూ ఇప్పటివరకు కేవలం 66.6 మి.మీ. మాత్రమే కురిసి, ఏకంగా 65.3 శాతం భారీ వర్షపాత లోటు ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు అడుగంటుతున్న నేపథ్యంలో రైతులు వరి సాగును పూర్తిగా నివారించడం లేదా సాధ్యమైనంత వరకు తగ్గించుకోవడం ఎంతో శ్రేయస్కరమని ఆయన హితవు పలికారు. ఇలాంటి కరవు పరిస్థితులను తట్టుకుని, తక్కువ నీటితోనే అత్యధిక దిగుబడినిచ్చే ఉలువలు, సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు, సాములు, అరికెలు, ఉదలు వంటి చిరుధాన్యాలతో పాటు.. మినుములు, కందులు, అలసందలు వంటి పప్పుధాన్యాల సాగును చేపట్టాలని రైతులకు విజయ్ కుమార్ దిశానిర్దేశం చేశారు. నేలలో తేమను సంరక్షించుకోవడం, పడిన ప్రతి వర్షపు చుక్కనూ సద్వినియోగం చేసుకోవడం, వ్యవసాయ శాఖ రూపొందించిన ఖరీఫ్ కంటింజెన్సీ పంటల ప్రణాళికను పాటించడం ద్వారానే పెట్టుబడి నష్టాల నుంచి గట్టెక్కగలమని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు. ఈ సదస్సులో రైతులు అడిగిన పలు సందేహాలకు వ్యవసాయ అధికారి విజయ్ కుమార్ శాస్త్రీయ సమాధానాలిచ్చి నివృత్తి చేయగా, రైతులంతా ప్రత్యామ్నాయ చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక ఆసక్తి కనబరిచారు.


# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

**అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం**

**బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం**

**ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు**

**తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్**



**హైదరాబాద్,జులై 18.(జర్నలిస్ట్ వార్త)**

తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బిజెపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటెల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇరువురు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏమైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని వివరించారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.